క్లుప్తంగా

బుగ్గేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ఆకలివలస సమీపంలోని బుగ్గేశ్వర స్వామికి గురువారం మాసశివ రాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక హోమం చేశారు. పూర్ణాహుతి చేపట్టి భక్తులకు అన్నదానం చేశారు. పలుగ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ముమ్మరంగా బీటీఏ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న బీటీఏ నాయకులు

దొరవారిసత్రం : బీటీఏ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం శ్రీధనమల్లి, కల్లూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం 30 శాతం 12వ పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు రమేష్, శేషయ్య, కిరణ్‌కుమార్, నాగరాజు, శ్రీనివాసులు, వినయ్‌కుమార్, హుస్సేన్‌బాబు, రామయ్య, దొరబాబు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు నిత్యావసర సరుకులు



గూడూరు రూరల్ : గూడూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు సీఆర్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రతి నెలా ఆరోగ్య సంజీవని పేరుతో ఎయిడ్స్ బాధితులకు సరుకులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో బాధితులకు సరుకులు అందజేశారు. ఆర్ఎంవో రవికుమార్ మాట్లాడుతూ డాక్టర్ సీఆర్ రెడ్డి పేరు మీద ప్రతి నెలా ఎయిడ్స్ బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకులను డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి అందజేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ప్రతినిధులు రాము, దయాకర్, ప్రభాకర్, నక్కా రామక్రిష్ణ, నాగరాజు, వెంకటేశ్వర్లు, మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం



పండ్లు పంపిణీ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

గూడూరు రూరల్ : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎల్ఐసీ పనిచేస్తుందని ఆ సంస్థ గూడూరు బ్రాంచ్ మేనేజర్ నాగులు తెలిపారు. ఎల్ఐసీ 74వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రజలకు అనుకూలమైన పలు కొత్త పాలసీలను అమలు చేస్తున్నట్టు తెలిపారు.

బస్సులు ప్రారంభం

వాకాడు : స్థానిక ఆర్టీసీ డిపోకు మంజూరైన బస్సులను గురువారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. వాకాడు-విజయవాడ మధ్య తిరిగే రెండు బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు. డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు నాని, మధురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, కిషోర్ నాయుడు పాల్గొన్నారు.

యాప్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపు

నాయుడుపేట టౌన్ : విద్యుత్ వినియోగదారులు విత్యుత్ బిల్లులను ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్‌లోనే చెల్లించాలని విద్యుత్‌శాఖ ఈఈ ప్రసన్నకుమార్ వెల్లడించారు. విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించేవారు ఇక మీదట పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే తదితర వాటిలో చెల్లించడానికి వీలు లేదని పేర్కొన్నారు. తమ సంస్థ యాప్‌లలోనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, వార్డు, గ్రామ సచివాలయాల్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని బిరదవాడ సమీపంలో గురువారం రాత్రి బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అరవపెరిమిడికి చెందిన పసల వెంకటేశ్వర్లు, తన భార్య రాజేశ్వరితో కలిసి బైక్‌లో కానూరురాజుపాళెం వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. బిరదవాడ సమీపంలో బైక్ నిలుపుకుని ఉన్నారు. అదే సమయంలో దొరవారిసత్రం నుంచి బైక్‌లో వస్తున్న మేకల వెంకటచైతన్య అదుపుతప్పి ఢీకొన్నాడు. దీంతో వెంకటేశ్వర్లు, వెంకట చైతన్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్ఐ గోపి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వీరత్వం, త్యాగాన్ని కొనియాడారు. డీటీ గోపీనాథ్‌రెడ్డి, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంతోపాటు పలు సచివాలయాల్లో గురువారం అల్లూరు సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్, సిబ్బంది ప్రసన్న, దిలీప్‌కుమార్, కె.రవీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఏవో శివభాస్కర్ పులమాలవేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఈ సర్దార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, చెంచయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సిద్ధవరం ప్రాథమిక పాఠశాలలో అల్లూరిసీతా రామరాజు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం షకీలా, ఉపాధ్యాయుడు గౌస్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.



దొరవారిసత్రం: సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

పెళ్లకూరులో..

పెళ్లకూరు: స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ సంతోషినిబాయి, ఏఎస్‌వో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి : అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఓజిలిలో అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

నాయుడుపేటలో...

నాయుడుపేట టౌన్ : అల్లూరి సీతారామరాజు దేశం కోసం తన ప్రాణాలు త్యాగం చేసిచిరస్మరణీయులుగా నిలిచిపోయారని పలువురు అధికారులు తెలిపారు. ఆయన జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ రఫీ, వెంకట కృష్ణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు పాపాడి చంద్రారెడ్డి, షేక్ షబ్బీర్, నారాయణ రెడ్డి, రాయకులు కరింబాయి, వెంకటేశ్వర్లు, న్యాయవాది పసల చెంగయ్య, చెవూరి చెంగయ్య, పాలూరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పుదూరు బాలికల గురుకుల పాఠశాలలోనూ అల్లూరి సీతారామరాజు జయంతిని జరుపుకున్నారు. విద్యార్థులు అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేపట్టారు. ప్రిన్సిపాల్ రూత్‌రమోల, ఉపాధ్యాయినులు తన్నీరు శశికళ, పద్మజ, సుధ, కృపావళి, శ్రీదేవి, ఆర్ సునీత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో సీతారామరాజు జయంతి వేడుకలు



రాపూరు: సిద్ధవరం పాఠశాలలో నివాళుర్పిస్తున్న చిన్నారులు



రాపూరు : ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి సీతారామరాజుకు నివాళి



దక్కిలి: అల్లూరికి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



నాయుడుపేట టౌన్ : అల్లూరి సీతారామ రాజుకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు



నాయుడుపేట టౌన్ : పుదూరు బాలికల గురుకులంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

దొరవారిసత్రం : వరి పంటను ఆశించే తెగుళ్లపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏవో జ్యోతిర్మయి తెలిపారు. ఆమె గురువారం వేణుంబాకం, ఏకొల్లు, తల్లంపాడు, ఉచ్చూరు తదితర ఆర్బీకేల పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. వరి పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల గురించి వివరించారు. మట్టి నమూనా సేకరించి పరీక్షలు చేయించే విధానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆర్బీకేల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 277 హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నట్టు తెలిపారు. ప్రసుత్తం పంట ఎన్ను తీసే దశలో ఉందన్నారు. ఈ క్రమంలో కాండం తొలుచు, ఆకు ముడత వంటి తెగుళ్లు సోకినట్టు గుర్తించామన్నారు. వాటి నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు అసిఫేట్ వాడకం తగ్గించాలన్నారు. పంట ఎన్ను తీసే దశలో ఆఖరి కోటాలో యూరియాతో పాటు ఎంవోపీ(పోటాష్) 20-25 కేజీలు వేసుకోవాలని సూచించారు.



తల్లంపాడులో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో జ్యోతిర్మయి

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గూడూరు రూరల్ : అంతరిక్షంలోకి అడుగులు వేస్తున్న శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య పిలుపునిచ్చారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కేంద్ర ప్రభుత్వం సహాయంతో ఏర్పాటు చేసిన అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ ద్వారా టీకీ బోటో సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ టీకీ బోటో సంస్థ సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తూ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇందుకు గాను ఒక మిలియన్ ఖర్చు చేసేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురగదాస్, ఎస్ వెంకటరామిరెడ్డి, ఇమ్మానుయేలు, ధనుంజయ, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న వంకి పెంచలయ్య

వంగవీటి రంగా ఆశయాలు సాధిద్దాం



వంగవీటి మోహన్ రంగాకు నివాళులర్పిస్తున్న నాయకులు



దర్గా సెంటర్ వద్ద అన్నదానం చేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : వంగవీటి మోహన్‌రంగా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాయల్ క్లబ్, రాధా, రంగా మిత్ర మండలి సభ్యులు పిలుపునిచ్చారు. వారు గురువారం వంగవీటి మోహన్‌రంగా జయంతిని జరుపుకున్నారు. పట్టణంలోని దర్గా సెంటర్ వద్ద మోహన్‌రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం దర్గా సెంటర్ వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గిండి సతీష్ కుమార్, ఆకుల కుబేరు మణి, మాజీ కౌన్సిలర్ శేషం మునిగోపి, మద్దాలి ప్రసాద్, యశ్వంత్, లక్ష్మీపతి, వాచ్ బాబు, ఏపీ కుమార్, దాము, దిలీప్, గిండి సోము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ఓజిలి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని అత్తివరం ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ సగుటూరు మల్లికార్జున, టీడీపీ నాయకులు కాటూరు ఫణేందర్‌రెడ్డి, వేలూరు వర్మారెడ్డి, మాజీ సర్పంచ్ కొండూరు సునీత తెలిపారు. మండలంలోని వజ్జవారిపాలెం ప్రాథమిక, అత్తివరం ఉన్నత, పెదపరియ రాచపాళెం పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు విద్యాసామగ్రి, కిట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన క్రీడామైదానం, తరగతి గదులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందజేస్తున్నట్టు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభనకుమారి, ఉపాధ్యాయులు అశోక్‌రాజు, చక్రపాణి, టీడీపీ నాయకులు కొండూరు సుబ్రమణ్యంరాజు, మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న నాయకులు

రావిగుంటపాళెంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

వాకాడు : మండలంలోని రావిగుంటపాళెంలో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని మాతృభూమి సేవా సమితి ప్రతినిధులు కోరారు. రాష్ట్రంలో అనేక చోట్ల డయేరియా విజృంభిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇకనైనా అధికారులు స్పందించి చెత్తకుప్పలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.



వాటర్ కూలర్ వితరణ

కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవిక ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆమె గురువారం కార్యాలయానికి రూ.10 వేల విలువైన వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. దాన్ని ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు. వారు ఆమెను అభినందించారు.

6న కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు

గూడూరు రూరల్ : జూనోసిస్‌డే సందర్భంగా 6వ తేదీన పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ టీకాలను ఉచితంగా వేస్తున్నట్టు గూడూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ తెలిపారు. పెంపుడు కుక్కలు, పిల్లుల వల్ల పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వాటి నుంచి రక్షణ పొందాలను కుంటే ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేయడం వల్ల భవిష్యత్తులో రేబిస్, మెదడు వాపు వ్యాధి, హైపటైటిస్, అమ్మవారు, డెంగీ, కొక్కెర తెగులు, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, సల్మానేల్లోసిస్, లిస్టరిమోసిస్, టీబీ, అమిబీయాసిస్, టెనియాసిస్ తదితర వ్యాధులను అరికట్టవచ్చన్నారు.

అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు

దక్కిలి: అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ (కౌలు రైతు సర్టిఫికెట్లు) మంజూరు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం వీఆర్వోలు, వ్యవసాయశాఖ వీఏవోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు సీసీఆర్‌సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. భూ యజమాని కౌలు రైతు ఒప్పంద పత్రం అందజేస్తే ఉచితంగా కార్డులు ఇస్తామని, ఈ సర్టిఫికెట్ కాల పరిమితి 11 నెలలు ఉంటుందని తెలిపారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతింటే పరిహారాన్ని కౌలు రైతులకు అందజేస్తామన్నారు. భూ యజమానులు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని, అన్ని హక్కులు భూ యజమానికే ఉంటాయన్నారు. కౌలు కాల పరిమితి వరకు మాత్రమే కౌలు రైతులకు హక్కు ఉంటుందన్నారు. పాసు పుస్తకాలు, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మార్చడం జరగవన్నారు. ఈ విషయాలను ఆయా గ్రామాల వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామసభ ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

కండలేరులో 6.312 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.312 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

గూడూరు రూరల్ : డయేరియాతో ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం నాయకులు విమర్శించారు. వారు గురువారం గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరులో పర్యటించారు. వారు మాట్లాడుతూ చెన్నూరు సినిమా హాల్ వీధిలో పది రోజుల్లో డయేరియాతో ఇద్దరు మృతి చెందారని తెలిపారు. అలాగే ఇటీవల గిరిజన గురుకుల పాఠశాలలో 18 మంది విద్యార్థులు అతిసారం బారిన పడ్డారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పాఠశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినా గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఆయా ప్రాంతాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం రమణయ్య, గంటా వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సతుకుమాటికి మేరిగ పరామర్శ



సతుకుమాటి సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మేరిగ మురళీధర్, తదితరులు

చిల్లకూరు : మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సతుకుమాటి సుధీర్‌రెడ్డిని గురువారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. సుధీర్‌రెడ్డి తనయుడు అఖిల్ రెడ్డి ఇటీవల అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఆయన ఉత్తర క్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో మేరిగ మురళీధర్‌తో పాటు పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని సుధీర్‌రెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ చిట్టమూరు మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చిట్టమూరు మండల ఎంపీటీసీ ఫక్కీరయ్య, నాయకులు కస్తూరిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజీవ్‌రామిరెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే చిల్లకూరు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సతుకుమాటిని పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

బంద్ విజయవంతం



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

గూడూరు రూరల్ : నీట్ పరీక్షలో జరిగిన అవినీతిని వెలికి తీసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం చేపట్టిన బంద్ గూడూరులో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. పట్టణంలోని పలు కళాశాలలు, విద్యా సంస్థలను మూసివేయించారు. వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో చోటు చేసుకున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయకపోవడం దారుణమన్నారు. పలు పార్టీల నాయకులు పార్లమెంటులో ప్రశ్నిస్తున్నా ఆ శాఖకు చెందిన మంత్రులు కనీసం సమాధానం కూడా చెప్పకపోవడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పీ శ్రీనివాసులు, శశి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలని వినతి

కోట: మండలంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పద్మను మార్చొద్దంటూ దళితవాడ మహిళలు గురువారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను మార్చేందుకు కోటకు చెందిన టీడీపీలోని ఓ వర్గం నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వాకాడుకు వెళుతున్న ఎమ్మెల్యే వాహనాన్ని మహిళలు కోట క్రాస్ రోడ్డులో అడ్డుకున్నారు. దీంతో వాహనం దిగిన ఎమ్మెల్యే మహిళలతో మాట్లాడారు. నాయకులతో మాట్లాడి ఫీల్డ్ అసిస్టెంట్‌పై నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

కొత్త చట్టాలను వ్యతిరేకిస్తూ న్యాయవాదుల నిరసన



నాయుడుపేట కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్ : కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన చట్టాలను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు గురువారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్ష్య అదినియం తదితర చట్టాలు పౌర హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. వాటిని మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వీరాస్వామి, షేక్ రఫీ, దశయ్య మొదలియార్, ఆశా చెంచుకృష్ణయ్య, మొరా ఈశ్వరయ్య పాల్గొన్నారు.